# సత్యవాక్యు

# THE WORD OF TRUTH

క్రైస్తవతెలుగు మాసపత్రిక

SEPTEMBER - 1998

# సంక్షిప్తవార్తలు

1998 ఆగస్టు 6వ తేదీనాడు కాకినాడ రూరల్ మండలం రేపూరులో జరిగిన సువార్త కూటములో సహో: నెహెమ్యా గూటం గారు, సహో. నోబుల్ గారు వాక్య పరిచర్య గావించగా 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆగస్టు 7,8,9 తేదీలలో కొవ్వాడ గ్రామములో జరిగిన సువార్త కూటములలో సహో. యి. ప్రభాకర రావ్, యం. యోబురాజు, జాషువాగూటం, పి.చంద్రశేఖర్, జి.ఫల్గుణరావ్, రాకేష్‌నాగ్ గార్లు పాల్గొనిరి, వాక్యపరిచర్య గావించిరి. సువార్త కూటములలో 9 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రేపూరులోను, కొవ్వాడలోను గంటా ఫిలిప్పుగారు క్రీస్తు కొరకు బలమైన సేవ చేయుచు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో ఉపాధ్యాయులుగా కూడ పనిచేయుచున్నారు.

ఆగస్టు 12,13,14 తేదీలలో కర్నాటక రాష్ట్రంలోని హోస్పేట పట్టణంలో గొప్ప సువార్త కూటములు, బైబిలు తరగతులు నిర్వహించబడెను. వాటిలో సోదరులు జాషువా గూటం. ఆర్.సి.హెచ్. సద్గుణరావ్, వి.చిన్నయ్య, యన్.ఏలియా గార్లు పాల్గొని చక్కటి వాక్యపరిచర్య చేసిరి. ప్రతిరోజు మూడు కూటములు నిర్వహించబడగా వందలాది కన్నడ-తెలుగు భాష మాట్లాడు ప్రజలు హాజరై సత్యవాక్యము సరిగ విభజింపబడుచుండగా వీనుల విందుగా ఆలకించిరి. కూటములు అత్యంత మహిమ కరముగాను, స్థానిక సంఘమునకు ప్రోత్సాహ కరముగాను జరిగినవి. యిద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అనేకులు బేసిక్ బైబిలు కోర్సులో చేరుటకు తమ తమ అడ్రసులనిస్తూ ఆసక్తి కనుబరచిరి. హోస్పేటలోను, పరిసరప్రాంతములలోను సోదరులు పి.భాస్కర్ గారు క్రీస్తు కొరకు మంచి సేవ చేయుచున్నారు. దూరప్రాంతములనుండి వచ్చినవారికి స్థానిక సంఘము చక్కటి భోజన వసతులను కల్పించిరి. సంఘసభ్యులు, యౌవనులు అత్యంత ఆకర్షణీయమైన తెలుగు-కన్నడ పాటలను వినిపించి తమ ఆత్మీయానందమును యితరులతో పంచుకొనిరి. కర్నాటకలో జరుగుచున్న సువార్త కొరకు మనందరం ప్రార్ధించుదాం.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 సెప్టెంబరు 1998 సంచిక 2


## సంపాదకీయం

## తీర్పునాటి కొన్ని విస్మయములు
## ( Some Judgement day Surprises )

భవిష్యత్ నందు నిత్య తీర్పునందు నీకు నమ్మిక గలదా ? మృతులకు సజీవులకు తీర్పు తీర్చగలవానికి నీవు ఏదో ఒక దినమున లెక్కయొప్పగించవలెనని నీవు నమ్ముదువా ?ఆ దినమున చీకటియందు నిగూఢమైన విషయములు వెలుగులోనికి రప్పింపబడుననియు, హృదయాలోచనలు బయలుపరచ బడుననియు నీవు నమ్ముదువా ? తీర్పు అనునది దేవుని యొక్క గొప్ప బయల్పాటులో యొక భాగమని నీవు నమ్ముదువా ? ఇది నమ్మవలసిన ఆవశ్యకత గలదని నేను చెప్పుచున్నాను. అయితే అనేకులు ఇట్టివాటిని నమ్మరు. వారు నమ్మరు గనుక వారి అంతము భయంకరముగా నుండును.

## తీర్పు దినమొకటి కలదు

మానవుడు దేవుని కలుసుకొనునట్టి గొప్ప కలయికను గూర్చి స్పష్టముగా బైబిలు విశదీకరించుచున్నది. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఏలయనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిని అనుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు" (అపొ.కా. 17:30,31). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2కొరింథీ 5:10). "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). "మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:12). తీర్పుయొక్క ప్రత్యక్షతకు అనేకులు విస్మయమొందుదురు.

## తీర్పు సమయము

తీర్పు సమయమందు అనేకులు ఆశ్చర్యచకితులగుదురు. "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మార్కు 13:22). క్రీస్తు ఆగమనము ఏ మనుష్యుడును ఎరుగడు, దూతలు ఎరుగరు, తండ్రికి తప్ప కుమారునికి గూడ తెలియదు. అంత్యదినమున క్రీస్తు ఆగమనము సంభవించును (యోహాను 12:48).

తీర్పు యొక్క సంకల్పమునకు అనేకులు విస్మయమొందుదురు. ఒకని దోషమును లేదా నిర్దోషత్వమును నిర్ణయించుటకు జరుగు యొక విచారణ వంటిది ఆ దినమునందు జరుగదు. దేవునికి సమస్తమును తెలియును. ఈ జీవితమందే మనము శోధింపబడి మరణము చేత మన గమ్యమును ముద్రించు కొనుచున్నాము. "ఆయనయందు విశ్వాసముంచు వానికి తీర్పు తీర్చబడదు, విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు. గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను" (యోహాను 3:18). "నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు, వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24). ఈ రెండు వాక్య భాగములందు గల వర్తమాన కాలములను సూచించు మాటలను గమనింపుము. రక్షింపబడుటకు లేదా నశించి పోవుటకు మనము తీర్పునాటి వరకు ఎదురు చూడవలసిన అవసరము లేదు. ఇప్పుడే మనము రక్షింపబడవచ్చును. లేదా నశించిపోవచ్చును. తీర్పుదినము దుష్టులను శిక్షించుటకు నీతిమంతులకు మహిమకరమగు ప్రతిఫలమును అను గ్రహించుటకు నియమింపబడెను.

## తీర్పు ప్రామాణికము

తీర్పునాటి ప్రామాణికము లేదా కొలబద్దకు అనేకులు విస్మయ మొందుదురు. ఏలయనగా ఆ దినమందు మానవ ప్రామాణిక గ్రంధములకు సిద్ధాంతములకు తావుండదు. మన పితరుల భక్తికి మన స్వకీయ నైతిక ప్రవర్తనకు ఆ దినమందు తావుండదు. మన సత్ భావములకు, నమ్మకములకు నిజాయితీలకు ఆ దినమందు తావుండదు. దేవుని వాక్యమే నాడు ప్రామాణికముగా నుండును. మన ప్రభువు ఇట్లనుచున్నాడు ; "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమున వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48).

ఆగ్రంధముల యందు వ్రాయబడిన వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:12).

తీర్పునాడు ఉత్పన్నమగువాటిని గూర్చి అనేకులు విస్మయమొందుదురు. తొలగి పోవుట వలనన వారందరూ ఆశ్చర్యపడుదురు. ఏలయనగా కొద్ది వారే రక్షింపబడుట వలన వారు విస్మయము చెందుదురు. విశాలమార్గము ఇరుకు మార్గములను గూర్చి యేసుక్రీస్తు మత్తయి సువార్తలో వివరించుచూ ఆయవ తీర్పు దినమును గూర్చి బోధించుచున్నాడు (మత్తయి 13:14). తీర్పు దినమందు విధించబడిన అంతిమశిక్ష నరకములో నిత్యము యుండుట వలన వారు మిక్కిలి విస్మయము మొందెదరు.

- రోయ్ బీస్లే.

## మా దినములు లెక్కించుట మాకు నేర్పుము

"మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కంచుట మాకు నేర్పుము" అని దైవజనుడైన మోషే ప్రార్థించాడు (కీర్తనలు 90:12). ఏమి! మోషేకు లెక్కలు రావా ? 24 గంటలు ఒకరోజు, 7 రోజులు ఒక వారం, 365 రోజులు ఒక సంవత్సరం అని మోషేకు తెలియదా ? బహుశ అది క్రీస్తు పూర్వపు కాలము. విజ్ఞాన శాస్త్ర మెరుగని రోజులవి అందుకనేమో అలా ప్రార్థించాడు. నేడు కంప్యూటర్ యుగంలోని మనకు దినముల లెక్కించుట పర్ఫెక్ట్‌గా వస్తుంది అనుకుంటున్నారా ? అలా అనుకుంటే పొరబాటు. దైవావేశము వలన వ్రాయబడిన ఈ లేఖనము గొప్ప భావాన్ని కలిగి యున్నది. భావయుక్తంగా దినములు లెక్కించుట నేర్చుకోవాలి. దినములు లెక్కించుట నేర్చుకున్నప్పుడు వివేక హృదయము కలుగును. ఎప్పుడైతే వివేక హృదయము కలుగుతుందో అప్పుడు దినములు లెక్కించుట ఎంత త్వరగా నేర్చుకోవలెనో మరియు దినముల లెక్కించుట ప్రాముఖ్యతను గూర్చి తెలిసికోగలము.

1. మనము దేవుని కలిసికొనుటకు సిద్ధపడాలి :-

మా దినములు లెక్కించుట మాకు నేర్పుమనగా మనము దేవుని కలిసికొనుటకు సిద్ధపడాలని తెలిసికోవాలి. అంటే సరియైన సిద్ధపాటు కలిగి యుండుటకు నేర్పుయని అర్థం - "జ్ఞానము ఆశ్రయాస్పదము. ద్రవ్యము ఆశ్రయాస్పదము; అయితే జ్ఞానము దాని పొందినవారి ప్రాణమును రక్షించును; ఇదే జ్ఞానము వలన కలుగు లాభము" (ప్రసంగి 7:12). మరణము జీవితమును గూర్చి తీవ్రముగా ఆలోచించునట్లు చేయును. దేవునితో మనకున్న సంబంధమును గూర్చి ఆలోచించునటుల చేయును. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). భౌతిక మరణము మన క్రియలకు ముద్రవేయును. భౌతిక మరణానంతరము మనము నిశ్చేష్టులమగుదుము. ఒకరితో సమాధానపడ వలెనన్న, ఒకరికి అచ్చి యున్నది చెల్లించవలెనన్న లేక ఒకరిని క్షమాపణ అడుగవలెనన్నా, బ్రతికి యున్నప్పుడే చేయాలి. అలా చేయనిచో చనిపోయిన తరువాత ఏమియు చేయలేము. దేవుని తీర్పునకు ఎదురు చూడాలి. "... మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి" (ఆమోసు 4:12). ఎప్పుడైతే ఈ విషయమై గ్రహింపు కలుగునో ఆ గ్రహింపు దేవుని కలిసికొనుటకు ధైర్యమును సిద్ధపాటును అనుగ్రహించును. అదే జ్ఞాన హృదయము.

2. దినములు లెక్కించుట నేర్చుకోవాలి అనగా పరిశుద్ధత కలిగియుండాలి:-

దినములు లెక్కించుట నేర్చుకొనుటకు లోప రహితమైన పరిశుద్ధత కలిగియుండుటకు నేర్చుకోవాలి. "అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగి యుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు" (హెబ్రీ 12:14) అని లేఖనము చెప్పుచున్నది. పరిశుద్ధత అనగా ప్రభువు రక్తముచే కడుగబడాలి. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడు చున్నవారు దేవుని

తలంచుదురు. దైవభక్తిని గూర్చి అప్పుడు ఆలోచించుదురు. దాని ప్రాముఖ్యతను అప్పుడు తెలిసికొందురు. పాపభోగములకన్న దేవునితో నిత్యత్వము ఎంతో గొప్పదని గ్రహించుదురు. అందువలన బ్రతికియున్నప్పుడే, శరీరావయములు బాగుగా పనిచేయునపుడు, మానసికి స్థితి సరిగా నున్నప్పుడే ప్రభువు రక్తంచే పరిశుద్ధ పర్చబడాలి. "ఆయన యందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును" (1యోహాను 3:3). కావున దినములు, లెక్కించుట నేర్చుకొనినచో అది పరిశుద్ధత కల్గియుండు ప్రాముఖ్యతను, అందరితో సమాధానము కలిగియుండుటకును నేర్పగలిగి జ్ఞాన హృదయము కలుగునట్లు చేయును.

3. దినములు లెక్కించుట నేర్పుమనగా - ఏది ప్రాముఖ్యమైనదో గ్రహించుటయే:-

"మీరు క్రీస్తుతో కూడా లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటి మీదనే గాని భూ సంబంధమైన వాటిమీద మనస్సు పెట్టకుడి". (కొలస్స 3:1-2). జీవితములో ప్రాముఖ్యమైనది పైనున్న వాటిని వెదకుట.

సాధారణంగా మనుష్యులు భూ సంబంధమైన వాటియందు మనస్సు కలిగి యుందురు. ఆస్తి సంపాదన, పేరు, పలుకుబడి, తమ పిల్లల చదువులు అనువాటి యందే మనసును కలిగియుందురు. కాని అది ముఖ్యమైనది కాదు. అవి లోక సంబంధమైనవి. "వ్యభిచారిణులారా ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా ? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయుగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). మనము ఈ లోకమును, దేవుని ప్రేమించలేము. "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు." మనము దేవునికిని సిరికిని దాసులుగా నుండలేము (మత్తయి 6:24). కావున ఈ జీవితంలో ముఖ్యమైపది సంపాదన కాదు. ఈ విలువైన జీవితములో పైనున్న

వాటిని అనగా ఆత్మ సంబంధమైన వాటిని వెదకాలి. అక్కడ యేసుక్రీస్తు ఉన్నాడు. ఆయనే నిత్య జీవమివ్వగలడు. శాశ్వతమగు పరలోక ధనం పొందుటకు ఈ లోకంలో క్రీస్తు కొరకు ప్రయాసపడాలి. అదే ప్రాముఖ్యమైనది.

**4. మరణము ఆత్మీయ విషయాలపై ధ్యానముంచునదిగా చేయును :-**

మన కుటుంబములో భవిష్యత్ సంపాదన కాదు గాని వారి ఆత్మీయ జీవితం ముఖ్యం. మన కుటుంబము క్రీస్తు అను పునాదిపై కట్టబడునట్లు చూడాలి. 'పిల్లలు దేవుని వాక్యమును అనుసరించి నడుచుకొనుచున్నారో లేదో పరీక్షించాలి. దైవభక్తితో వారిని నడిపించుట ముఖ్యమని గమనించాలి.

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభువు బోధలో పెంచాలని దేవుడు ఆజ్ఞాపించాడు. "తండ్రులారా మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీ 6:4). నేడు తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కొరకు ఉత్తమమైన పాఠశాలను, ఉత్తమమైన కళాశాలను వెదకి అందులో చదివిస్తారు. కాని ఏది ఉత్తమమైన సంఘము ఎక్కడ మా పిల్లలు దైవ వాక్యం శ్రద్ధగా నేర్చుకోగలరని ఆలోచించువారు అరుదు. దేవునితో మన సంబంధము మన పిల్లల సంబంధము ప్రార్ధన పూర్వకంగా ఉండాలి. తన వాక్యానుసారంగా విధేయత గల బంధమై యుండాలి. జ్ఞానయుక్తంగా యుండాలి. దేవుని రాజ్యమును నీతిని మొదట వెదకాలి. దేవుని వాక్యం ద్వారా మన దినములు లెక్కించుట నేర్చుకొందుము.

- **V.J.** బెన్సన్, హైదరాబాద్

# మరణం
# (Death)

ఈ లోకంలో పుట్టిన ప్రతి మానవుడు ఏదో ఒక దినాన మరణించక తప్పదు. ఎందుకనగా మరణం దైవ నియమం. "మనుష్యులొక్కసారే మృతిపొంద వలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27).ప్రతి ఒక్కరూ మరణించెదరని ఈ లేఖనము చెప్పుచున్నది. మరణమనగా ఎడబాటు లేక వేరగుట అని అర్థము. శరీరమునుండి ఆత్మ వేరగుటవలన మరణము సంభవించును. ప్రాణము లేని శరీరము మృతము (యాకోబు 2:26). మరణ మనగా వెడలిపోవుట అని కూడా అనవచ్చును. (2తిమోతి 4:6). మానవుడు నేలనుండి తీయబడిన వాడు కనుక తిరిగి మన్నైపోవును (ఆది 3:19; ప్రసంగి 12:7). "మన్నయినది వెనుకటి వలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరలపోవును". మరణించుటకు కూడ ఒక సమయము కలదని లేఖనములు చెప్పుచున్నవి (ప్రసంగి 3:1-8). "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, అలాగుననే మనుష్యులందరును పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" (రోమా 5:12). ఆదాము హవ్వలనుండి మనకు సంప్రాప్తమైన ఈ మరణమునుండి తప్పించుకోవాలని మానవుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ గర్భ శ్రీమంతుడికైనా కటిక దరిద్రుడికైనా మరణం తప్పదు. మృత్యువునుండి తప్పించుకొనుట ఎవ్వరికినీ సాధ్యము కాదు, మృత్యువుకు ఎట్టి విధమైన బేధములు లేవు. పసిపిల్లలని, యౌవ్వనులని, వృద్ధులని తేడా లేదు. అందరిని అది స్వాధీనపరచుకొనగలదు.

మానవ జీవితము క్షణభంగురము. జీవితమనగా కొద్ది దినములు "స్త్రీకనిన నరుడు కొద్ది దినముల (కించితాయుస్సు) వాడై మిక్కిలి బాధనొందును" (యోబు 14:1). అది యొకని నిద్ర, అది యొక పువ్వు వంటిది, అది గడ్డి వంటిది, అది

మాయమైపోవు ఆవిరి వంటిదని మరణమును గూర్చి కొందరు వర్ణించిరి (కీర్త 90:5; 103:15; యెషయా 40:6; యాకోబు 4:14).

మృత్యువును జయించాలని మానవుడు ప్రయత్నిస్తున్నాడు కాని అందు విఫలుడవుతున్నాడు. మృత్యుభీతిలో మానవుడు ఈనాడు జీవించుచున్నాడు. మృత్యుభీతి నుండి మనలను విడిపించువాడు ఒకే ఒక్కడు గలడు ఆయన మరణమును జయించినవాడు. మరణాధిపతి ఆయనే ప్రభువైన క్రీస్తు (1కొరింథీ 15:51-58). "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికి చనిపోడు" (యోహాను 11:25-26). మరణము మానవ జీవితమునకు అంతము కాదు. నిత్యగమ్యమునకు సుస్వాగతము (యోహాను 14:1-4).

యేసుక్రీస్తునందు అనగా ఆయన సంఘమందు ఉన్నట్లయితే మరణానికి భయపడనవసరము లేదు. " ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు" (ప్రకటన 14:13). క్రైస్తవుని మరణము దేవుని దృష్టికి విలువగలది (కీర్తన 116:15). మరణమును గూర్చి క్రైస్తవులు భీతిల్లరాదు. క్రైస్తవులకు గొప్ప నిరీక్షణ కలదు (1థెస్స 4:13-18).

ప్రియ సోదరా, సోదరీ నీవు నేను భౌతిక మరణమును ఎదుర్కొనక తప్పదు. మన తండ్రిని కలుసుకొనుటకు మనము ఏదో ఒక దినాన ప్రయాణము చేయక తప్పదు. మంటి శరీరమును విడిచి మహిమ శరీరమును దాల్చి ఆత్మ స్వరూపుని నిత్యము స్తుతించుచుందుము. మనకీ లోకము శాశ్వతము కాదు. స్థిర నివాసము పరమందు కలదు. నీవు క్రీస్తు సువార్తకు లోబడక పోయినట్లయితే నీ ఆత్మ ఘోర నరకమునకు అప్పగించబడును (2థెస్స 1:7-9; ప్రకటన 21:8). నీవు నిత్యమూ జీవించవలెనని కోరుకొనినచో క్రీస్తు వాక్యమును వినుము, విశ్వసించుము, మారుమనస్సునొందుము, యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని

పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందినచో క్రీస్తు తన సంఘమందు చేర్చుకొనును. నీవు మరణమును క్రీస్తు ద్వారా జయించవలెనని ఆశించుచున్నాను (1కొరింథీ 5:1,17). మన పౌరస్థితి పరలోకమందు ఉన్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము (ఫిలిప్పీ 3:20).

- పి. చంద్రశేఖర్, కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

## విశ్వాసముతో కూడిన అర్పణ

ఆదాము, హవ్వల మొదటి కుమారునిగ కయీనును, రెండవ కుమారునిగ హేబెలును చూచెదము. కయీను భూమిని సేద్యపరచువాడు. హేబెలు గొఱ్ఱెల కాపరి. కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్యపెట్టెను. యెహోవా కయీనును, అతని అర్పణను లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి తన తమ్ముడైన హేబెలును చంపెను. ఈ విధంగా మొదటి హత్య జరిగినది. 1యోహాను 3:12 ప్రకారము ఆదాము, హవ్వల మొదటి కుమారుడు దుష్టుని సంబంది అని చూడగలము. యూదా పత్రిక 11వ వచనము ప్రకారము ఆదాము, హవ్వల మొదటి కుమారుని మార్గము విశ్వాస మార్గము కాదు. విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు (హెబ్రీ 11:4,5). ఈ వాక్యములో మనం "విశ్వాసము" అను పదమును మూడుసార్లు గమనించెదము. ముఖ్యముగా హేబెలు విశ్వాసముతో కూడిన శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. ఈ ప్రకారము మన అర్పణలు విశ్వాసముతో కూడినవిగా ఉన్నాయో, లేదో పరీక్షించుకొనవలెను. మరి ముఖ్యముగా మనం

కయీను మార్గమున నడువక, హేబెలు మార్గమున నడుచు కొనవలెను. ఎందుకనగా కయీను దుష్టుని సంబంధి మరియు కయీను మార్గము శ్రమల మార్గము. హేబెలు మార్గము నీతిమంతుని మార్గము. మరియు విశ్వాసముతో కూడిన మార్గము. కావున ప్రియ చదువరీ! నీవు ఏ మార్గమున వున్నావో పరీక్షించుకొనవలెను. మరి ముఖ్యముగా నీ అర్పణ విశ్వాసముతో కూడినదిగా వుందో, లేదో పరీక్షించుకొనవలెను.

**- K.N. ప్రకాష్, శ్రీశైలం.**

## నిద్ర - దానియొక్క ఫలితము

ఈ దినములలో అనేక స్థలములలో ప్రమాదము లేక జాగ్రత్త! అనే బోర్డులు మనలను హెచ్చరిక చేస్తూ ఉంటాయి. తుఫాను గూర్చి, యుద్ధాలను గూర్చి రేడియో, టీ.వీ.ల ద్వారా హెచ్చరికలు చేస్తూ తగిన చర్యలు తీసుకుంటూ ప్రజలను అప్రమత్తులుగా ప్రభుత్వము వారు చేస్తూ యుంటారు. అటువంటి హెచ్చరికలు వింటూ చూస్తూ కూడ ఎంతోమంది నిర్లక్ష్యంగా వ్యవహరించి నందున వారి ప్రాణములు పోగొట్టుకొంటున్నారు. వాహనాలు నడిపేవారు కూడ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నిద్రమత్తులై వారి ప్రాణాలు కోల్పోవుచూ అనేకమంది ప్రాణాలు కూడ పోగొట్టుకునేందుకు కారకులు అవుచున్నారు. వీటిన్నిటికి కారణం ఒక్కటే - నిర్లక్ష్యం అనే నిద్ర మత్తులో యుండి దాని ఫలితాన్ని పొందుచున్నారు.

ప్రభువు రెండవ రాకడ కొరకు నిరీక్షిస్తున్న క్రైస్తవులైనవారు కూడ ఈ దినములలో సంఘములలో నిద్రమత్తులుగా యుండి దేవుని ఉగ్రతకు లోనవుటకును వారి ఆత్మను నరకములోనికి నెట్టబడేందుకు ఈలోక సంబంధమైన సుఖభోగాలపై మనస్సునుంచి నిర్లక్ష్యమనే నిద్రలో మత్తులై దాని

ఫలితమేమిటని ఆలోచించక ఎంతోమంది నిద్రమత్తులోనే యున్నారు. ఇలాంటి వారిని కొందరిని బైబిలు గ్రంథమునుండి చూద్దాం !

1. సంసోను : గాజాకు వెళ్ళి దెలీలా అనే వేశ్యను చూసి మోహించి ఆమె యొద్దకు చేరాడు. ఫిలిష్తీయుల సర్దారులు కొంత సొమ్మిచ్చి ఆ వేశ్యను కొనుక్కొని ఆమె ద్వారా సంసోనును చంపదలచిరి. ఆమె అతని బలము ఎక్కడ ఉందో యని అడిగి తెలిసికొని తన తొడమీద సంసోనును నిద్రపుచ్చి ఫిలిష్తీయులకు అప్పగించెను. వేశ్య మోహములో పడి పాపానికి దాసుడై కామాతురత వలన అంధుడై నిద్రపోయి శత్రువుల చేతికి చిక్కి బలము, శక్తియు, రెండు కళ్ళు కూడ పోగొట్టుకొని బందీ గృహములో తిరుగలి విసరేవాడు అయెను. ఇశ్రాయేలీయులకు ఇరువది సంవత్సరములు న్యాయాధిపతిగా యున్న సంసోను పాపమనే నిద్రవలన ఏ స్థితికి దిగజారెనో గమనించవచ్చు. తల్లి గర్భమునుండి పుట్టినది మొదలుకొని దేవునికి నాజీరు చేయబడినప్పటికి పాపముచే కలుగు నిద్రవలన తన శక్తినంతయు పోగొట్టుకుని చివరికి తన ప్రాణములు పోగొట్టుకొనవలసి వచ్చెను. తాత్కాలిక సుఖ భోగము వలన సంసోను ఎంత దౌర్భాగ్యపు స్థితిని ఎదుర్కొని నాడో గమనించండి (న్యాయాధిపతులు 16వ అధ్యాయము).

2. పదిమంది కన్యకలు : పదిమంది కన్యకలే వారంతా దివిటీలు కలిగి పెండ్లి కుమారుని రాక కొరకు ఎదురుచూచిన విశ్వాసులు. అయితే పెండ్లి కుమారుడు వచ్చుట కొద్దిపాటి ఆలస్యమైనందున అందరూ కునికి నిద్రపోవు చున్నారు. అర్ధరాత్రి వేళ పెండ్లి కుమారుడు వస్తున్నాడు అతనిని ఎదుర్కొనుటకు రండి అని కేక వినినప్పుడు పదిమంది కన్యకలు మేల్కొని తమ దివిటీలను చక్కపర్చుకొనిరి. గాని ఐదుగురి దివిటీలలో నూనె లేనందున ఆరిపోవు చున్నవి. వారు పెండ్లి కుమారుని రాకను గూర్చి నిరీక్షణ కల్గియున్నను ఆ నిరీక్షణ నిర్లక్ష్యము వలన దివిటీలలో నూనె సంగతి మర్చిపోయి నిద్రించిరి. ఇదే [illegible] నిద్ర. వారా కేక విని అమ్మువారి యొద్దకు వెళ్లి నూనె కొనబోవుచుండగా [illegible]

కుమారుడు వచ్చెను. సిద్ధముగా నున్నవారు పెండ్లి కుమారునితో లోనికి ప్రవేశించిరి. వెంటనే తలుపులు వేయబడెను. విడువబడినవారు వచ్చి అయ్యా, అయ్యా! తలుపులు తీయుమని కేకలు వేసినా ఎంత మాత్రము ప్రయోజనము లేకపోయెను. అతడు మిమ్మును ఎరుగనని నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఆ విధముగా వారు పెండ్లి కుమారుని సహవాసము కోల్పోయిరి (మత్తయి 25:1-13).

3. యేసు శిష్యులు : యేసు అప్పగింపబడుటకు ముందు శిష్యులను వెంటపెట్టుకుని గెత్సెమనె చోటుకు వచ్చి మీరిక్కడ కూర్చొని యుండుడి నేను అక్కడికి వెళ్ళి ప్రార్థన చేతునని చెప్పి పేతురు, యాకోబు, యోహానును వెంటబెట్టుకొని పోయి దుఃఖపడుటకు, చింతా క్రాంతుడగుటకు మొదలుపెట్టెను. మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖముతో మునిగి యున్నది. మీరు ఇక్కడ నిలిచి నాతో కూడ మెళుకువగా ఉండుడని వారితో చెప్పినా - యేసు మరలా వచ్చి శిష్యులు నిద్రించుట చూసి "ఒక ఘడియైనను నాతో మేల్కొని యుండలేరా" అని ప్రభువు వారిని ప్రశ్నించెను. ఆ ఒక్క ప్రశ్నలో ప్రభువు మానవ కుమారునిగా తనలో ఉన్న నిరాశ, నిస్పృహ. బాధ, త్యాగము, అసహాయత అన్నీ చూడగలము. కాని దేవుని కుమారునిగా తండ్రి చిత్తము నెరవేర్చుటకే శరీరధారిగా ఆయన ఈ లోకానికి వచ్చెను. అయితే శిష్యులు మాత్రము శోధన వలన వచ్చిన నిద్రవలన ప్రభువు మనస్సును గాయపరచిరి (మత్తయి 26:36-46). అట్టివారు మనలో కూడ యున్నారేమో పరీక్షించుకొనుట మంచిది.

అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలయనగా మనుష్యులు స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, బింకములాడు వారు, అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జన ద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవుని కంటె సుఖా[illegible]ముగ ఎక్కు[illegible]వారు. అట్టి వారికి విముఖుడవై యుండుమని

అపోస్తలుడైన తిమోతిని హెచ్చరించెను (2తిమోతి 3:1-5).

మన విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచూ తిరుగుచున్నాడు. గనుక నిబ్బరమైన బుద్ధిగలవారై మెళకువగా యుండుడని పేతురు హెచ్చరించుచున్నాడు (1పేతురు 5:8).

యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచూ దివారాత్రులు దానిని ధ్యానించువాడు ధన్యుడు (కీర్తన 1:2).

న్యాయమైన నీ విధులను బట్టి నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు అర్ధరాత్రి వేళ నేను మేల్కొను వాడను (కీర్తన 119:62).

నేను నీ వాక్యము మీద ఆశ పెట్టుకొని యున్నాను. నన్ను ఎప్పుడాద రించెదవో అని నాకన్నులు నీవిచ్చిన మాటకొరకు కనిపెట్టి క్షీణించుచున్నవి (కీర్తన 119:82). ఈ మాటలు దావీదు మహారాజు అనుభవ పూర్వకముగా వ్రాసెను.

లేమికి భయపడి నిద్రయందు ఆసక్తి విడువుము. నీవు మేల్కొని యుండిన యెడల ఆహారము తిని తృప్తి పొందుదువు (సామెతలు 20:13).

యింక కొంచెము నిద్ర, యింక కొంచెము కునుకుపాటు పరుండుటకై యింక కొంచెము చేతులు ముడుచు కొనుట వీటివలన నీకు దరిద్రత పరుగెత్తి వచ్చునని సొలొమోను మహారాజు వ్రాశాడు (సామెతలు 24:33).

అన్నయను ప్రవక్త్రి దేవాలయమును విడువక ఉపవాస ప్రార్ధనలతో రేయి పగలు సేవ చేసెను (లూకా 2:36-37).

పౌలు అయితే మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్ళు విడుచుచూ ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పెను (అ.కా. 20:31).

దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనీయక సద్వినియోగము చేసికొనుచు అజ్ఞానులవలెకాక జ్ఞానులవలె నడుచు కొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుమని పౌలు ఎఫెస్సీ సంఘాన్ని హెచ్చరించెను. ఈ హెచ్చరికను మనము అన్వయించుకొని నిద్రించుచున్న మనము మేల్కొని నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక వెలుగు సంబంధులవలె నడచుకోవాలి (ఎఫెసీ 5:10).

మన ప్రభువైన యేసుక్రీస్తు కూడ దినమంతా సమాజమందిరాల్లో దేవుని రాజ్యమును గూర్చిన విషయాలు బోధిస్తూ రోగులను స్వస్థ పర్చుచూ, రాత్రంతా ఒలీవ కొండపైకి వెళ్ళి ఏకాంతముగా ప్రార్థించుచూ గడిపెను (లూకా 8:12, 27:37; యోహాను 8:1).

ఈ రోజుల్లో అనేకమంది నిర్లక్ష్యముచే దేవుని ఆరాధించుటకు రావాలన్నా, వాక్యము వినాలన్నా, ప్రార్థించుటలో సమయము గడపాలన్నా వెనుకంజ వేస్తూ దేవుడిచ్చే మహిమను పొందలేక, సంతోషముగా జీవించలేక పోవుచున్నారు. అయితే కడవరి దినాల్లో ఉన్న నీవు నేను ఏమి చేయాలనే ప్రశ్న వేసుకుందాము. పాపము, నిర్లక్ష్యము, శోధన, నిరుత్సాహము, అవిధేయత అనే నిద్ర మత్తు నుండి మేల్కొని మనము వెలుగు సంబంధుల వలె నడుస్తూ జీవించినట్లైతే మనం నిత్య జీవమును పొందగలము.

- పి. అబ్రహాము, విజయవాడ.

# పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించుట
## (Lifting up Holy Hands)

అపొ.పౌలు ఇట్లు వ్రాసాడు : "కావున ప్రతి స్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను" (1తిమోతి 2:8). "పవిత్రమైన చేతులెత్తుట" అంటే యేమిటి ? మానవులు చేతులలో చేయు దానిని గూర్చి గాక, వారి హృదయము యొక్కయు జీవితముల యొక్కయు స్థితిని పౌలు ఇక్కడ చెప్పుచున్నాడు.

బైబిలులో వివిధ భంగిమలలో ప్రార్థన చేయడం వివరించబడినది. వాటిలో కొన్ని : నిలబడి ప్రార్థించుట (1రాజులు 8:22), మోకాళ్ళూని ప్రార్థించుట (దానియేలు 6:10), కూర్చొని ప్రార్థించుట (లూకా 22:14,17), నేలమీద పడి ప్రార్థించుట (2సమూ 12:16), చేతులెత్తి ప్రార్థించుట (నెహెమ్యా 8:6), తలవంచి ప్రార్థించుట (నిర్గమ 4:31), ఆకాశము వైపు కన్నులెత్తి ప్రార్థించుట (యోహాను 17:1) మొదలగునవి. వీటిని బట్టి మన ప్రార్థనలు ఆలకింపబడుటకు మనం ఏదైనా ఒక ప్రత్యేక భంగిమలో యుండాలనునది గ్రాహ్యము కాదు. అయితే శరీరభంగిమ కాదు గాని ఒకని హృదయ పరిస్థితి దేవునికి ప్రాముఖ్యమైనది (1పేతురు 3:11,12).

మానవుడు తన చేతులను పనిచేయుటకు (1థెస్స 4:11), వ్రాయుటకు (కొలస్స 2:14), కట్టుటకు (మార్కు 14:58), కొట్టుటకు (కీర్తన 144:1) మొదలైన వాటికి ఉపయోగించును గనుక, ఒకని చేతులు వాని చేష్టలకు సూచనగా యుండును (ఆది 16:2; మత్తయి 6:3; మార్కు 9:43). ఒకని చేష్టలు (క్రియలు) మంచివైనను సరే, చెడ్డవైనను సరే అవి అతని హృదయ స్థితిని బట్టి యుండును (మత్తయి 12:34, 35; మార్కు 7:20-23). పాపపు అపరాధము గలవారు అపవిత్రమైన చేతులుగల వారుగా చిత్రీకరింపబడ్డారు (యెషయా 1:15; యెహెజ్కేలు 13:18-20; యాకోబు 4:8). ఒకని చేతులు కడుగుకొనుట వాని

అపరాధము కడుగబడుటకు సూచనగా చెప్పబడింది (ద్వితీ 21:6-9; కీర్తన 26:2; యాకోబు 4:8). యేసును సిలువ వేయుటలో తాను నిరపరాధినని చెప్పుటకు సూచనగా పిలాతు తన చేతులు కడుగుకొనెను (మత్తయి 27:24).

బైబిలులో ఒకడు చేతులెత్తి ప్రార్థించునప్పుడు, తన జీవితం పవిత్రముగా దేవునికి అర్పించునట్లుగుపడును. తత్ఫలితముగా అతని ప్రార్థనకు జవాబు లభించును. ఒకడు చేతులెత్తినను,. చేతులెత్తక పోయినను, ఒకని చేతులు మురికిగాయున్నను, శుభ్రముగా యున్నను అతని ప్రార్థన దేవునికి వినబడు ననుటలో సందేహములేదు. ఒకని చేతులయొక్క శుభ్రతను గాక దేవుడు హృదయము యొక్క శుభ్రతను కోరుచున్నాడు! హృదయములో పావపు మురికి యుండుట వలన ఒకని ప్రార్థనలు వినబడవు (యెషయా 59:1,2; కీర్తనలు 66:18).

యెషయా ప్రవక్త ఇట్లు వ్రాసాడు : "మీరు మీ చేతులు చాపునప్పుడు మిమ్మును చూడక నా కన్నులు కప్పుకొందును. మీరు బహుగా ప్రార్థన చేసినను నేను వినను. మీ చేతులు రక్తముతో నిండియున్నవి. మిమ్మును కడుగుకొనుడి. శుద్ధి చేసికొనుడి. మీ దుష్క్రియలు నాకు కనబడకుండా వాటిని తొలగింపుడి" (యెషయా 1:15,16).

పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించుట అంటే ఒకడు తన శరీరమును, మనస్సును ఆత్మను పూర్ణముగా దేవునికి సమర్పించుట యని అర్థం, ఒకని చేతులు ఆత్మీయముగా పాపముతో మైలపడియుంటే, క్రీస్తు రక్తములో కడుగుకొనుట వలన అతడు పవిత్రుడగును (ప్రక 1:5).

మానవులు ప్రార్థించునపుడు వారి హృదయాలు, జీవితాలు పవిత్రముగా యుండాలని దేవుడు కోరుచున్నాడు (రోమా 12:1; ఎఫెసీ 1:4). ఒకనికి చేతులు లేకపోయినను వాని జీవితం పవిత్రముగా యుంటే దేవుడతని ప్రార్థనను ఆలకించును! (1పేతురు 3:12).

- కెవిన్ మూర్, న్యూజిలాండ్.

## "భోజనము చేయునపుడెల్లా"
## (With Every Meal)

నీవు భోజనము చేయునపుడెల్లా దేవునికి ప్రార్ధింతువా ? గాలి, నీరు ఆహారము మనలను ఈలోకంలో జీవింపజేస్తాయి. మన ప్రాణం వాటిమీద ఆధారపడి యున్నది. వాటిని సృజించే శక్తి నీకుగాని నాకుగాని లేదు. ప్రాణము, దానిని కొనసాగించే మూలికలు దేవునినుండి కలిగే ప్రశస్తమైన యీవులు (అపొ.కా. 14;17; 17:28). వీటిననుగ్రహించుచున్న దేవునికి మనం ఎల్లప్పుడు కృతజ్ఞత కలిగి యుండాలి. మన జీవనోపాధిని మనం సంపాదించుకోవచ్చును గాని జీవమును సంపాదించుకోలేము.

మన ప్రభువు 5000 మందికి ఆహారము పెట్టుటకు ముందు ప్రార్ధన చేసారు. ఆయన "పచ్చికమీద కూర్చుండుమని జనుల కాజ్ఞాపించి, ఆ అయిదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని ఆకాశమువైపు కన్నులెత్తి ఆశీర్వదించి ఆ రొట్టెలు విరిచి శిష్యుల కిచ్చెను; శిష్యులు జనులకు వడ్డించిరి" (మత్తయి 14:19). ఆయన 4000 మందికి ఆహారము పెట్టక మునుపు కూడ ప్రార్ధించెను. "అప్పుడాయన నేలమీద కూర్చుండుమని జన సమూహమునకు ఆజ్ఞాపించి ఆ యేడు రొట్టెలను ఆ చేపలను పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వాటిని విరిచి తన శిష్యులికిచ్చెను, శిష్యులు జన సమూహమునకు వడ్డించిరి" (మత్తయి 15:35-36). ప్రభురాత్రి భోజన సమయంలో రెండుసార్లును (మత్తయి 28:26-28), ఆయన లేచిన తరువాత రొట్టె విరుచుటకు ముందును ఆయన ప్రార్ధించెను (లూకా 24:30). కృతజ్ఞతా పూర్వకమైన ఆయన మాదిరిని మనం అనుసరించాలి.

కొందరు దేవునిని సృష్టికర్తగా గౌరవించుట లేదని పౌలు చెప్పాడు: "వారు

దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు". (రోమా 1:21). "ఈ హేతువుచేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమానపరచు కొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను" (రోమా 1:24). అంత్య దినములలో కృతజ్ఞత లేనివారుందురని అపొ.పౌలు ప్రవచించెను (2తిమో 3:2). అయితే భూమి మీద నున్న వారందరు అన్న పానములు పుచ్చుకొనుచు ఆయనకు కృతజ్ఞత చెల్లించాలని ఆయన కోరుచున్నాడు (కీర్తన 22:29).

పైకి భక్తి పరులముగా కనబడాలని మనం ప్రార్థించరాదు (మత్తయి 6:5). సరిగదా సిగ్గుపడుచు ప్రార్థించుట మానరాదు (ఫిలిప్పీ 2:15; 1తిమో 4:12; 2తిమో 1:7-8,12). పౌలు తుఫానులో చిక్కుకొని, బ్రద్దలైపోవుచున్న ఓడలో యున్నను "యొక రొట్టె పట్టుకొని అందరి యెదుట దేవునికి కృతజ్ఞతా స్తుతుల చెల్లించి దాని విరిచి తినసాగెను" (అపొ.కా. 27:35). మనము గట్టిగా ప్రార్థన చేయలేని పరిస్థితిలో యుంటే మనం మనస్సులోనే ప్రార్థించవచ్చును. దేవుడు మన మనస్సులోని తలంపులను మాటలను వినగలడు (నెహెమ్యా 2:4-5; 1 సమూ 1:8-18; 1 దినవృత్తా. 28:9; రోమా 8:26-27). మనం భోజనం చేయునప్పుడు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము ఆయన సృజించిన వాటిని భుజించు చున్నామని మరచిపోరాదు (1తిమో 4:3).

- రోయస్ ఫ్రెడరిక్

## అంతర్యములో కొంచెము మాధుర్యము
## (A Lilte bit of Sugar Inside)

ఒక తల్లి తన ఆరు సంవత్సరముల కుమార్తెను కౌగిలించుకొని ఈ విధముగా అడిగెను. లోరీ! నీకు తీపిని (మాధుర్యాన్ని ) కలిగించేది ఏది ? ఆ బాలిక ఈలాగున జవాబిచ్చెను. "దేవుడు నన్ను చేసినపుడు, లోపల కొంచెము చక్కెర ఉంచితే బాగుండునని తలంచుచున్నాను". యేసుయొక్క ఉపదేశమును వినండి. "ఇయ్యుడి, అప్పుడు మీకియ్య బడును. అణచి కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని చెప్పెను" (లూకా 6:38). మంచితనము ప్రతిఫలమును దయచేయునని ఆయన మనకు తెలియజేయుచున్నాడు. "నీతిని కృపను అనుసరించు వాడు జీవమును నీతిని ఘనతను పొందును" (సామెతలు 21:21).

స్వారూప్యముగానున్న కొన్ని స్వభావములు :-

1. **Courtesy :** మర్యాద ( వినయమనస్సు ) :-

మర్యాద అనునది సార్వత్రికమైన భాష. పేతురు తన మొదటి పత్రిక మూడవ అధ్యాయములో ఈ విధముగా ఉపదేశించుచున్నాడు. "తుదకు మీరందరు ఏక మనస్కులై యొకరి సుఖదుఃఖముల యందు ఒకరు పాలుపడి, సహోదర ప్రేమ గలవారును, కరుణా చిత్తులును వినయమనస్కులునై యుండుడి (1పేతురు 3:8). తన ప్రియమైన అత్త నయోమికి సహాయముగా యుండుటకు రూతు క్రొత్త ప్రదేశమునకు వచ్చినది. ఆమె పగలంతయు పొలములో పనిచేయుచు కోయువారి వెనుక పనల మధ్యన ఏరుకొనుచుండెను. ఆమె యొక్క మంచి నడవడి మరియు చిరుదరహాసము బోయజు యొక్క హృదయమును గెలుచు కొన్నది (రూతు 2:11). చివరకు వారిద్దరు వివాహము చేసికొనిరి. రూతు తన

యొక్క మంచి మర్యాదను తనయొక్క మంచి మాధుర్యతను చూపక పోయిన యెడల ఈ చక్కని కధ వేరే విధముగా యుండును.

**2.Tact :** చాతుర్యము లేక సమయోచితముగా మాట్లాడుట :-

చాలా సున్నితమైన విషయములను ఎదుర్కొనుటకు ఈ గుణము కల్గియుండుట ఒకనికి ఆశీర్వాదకరము జ్ఞానియైన సొలొమోను సామె 25:11లో మనకు ఈ విధముగా తెలియ జేయుచున్నాడు. "సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్ల వంటిది". సరియగు సమయములో సరియగు రీతిగా మాట్లాడుట యనునది కొందరికి గొప్ప బహుమానమై యున్నది:బైబిలు పుటలను వెదికినట్లయిన గొప్ప ప్రయోజనమును సాధించుటకు ఎస్తేరు నియమింపబడినట్లుగా చూడగలము. ఆమె రాజుకొరకు విందును ఏర్పాటు చేసి హామానును కూడా ఆహ్వానించినది. హామాను యూదులకు బద్ధ శత్రువు. పర్షియా దేశములో నున్న ఇశ్రాయేలీయుల నందరిని స్త్రీలనేమి, పురుషులనేమి పిల్లలనేమి చంపు ఉద్దేశములో ఉండెను. రాజుకు తన కోరికను తెలియజేయుటకు సమయస్ఫూర్తితో వేచియున్న గొప్ప పాత్రగా రాణియైన ఎస్తేరు చూపబడినది. ఆమె గర్విష్టియైన హామానును మరొక పర్యాయము విందుకు ఆహ్వానించినది. సరియైన సమయము చూచి ఆమె అతనిపై నేరారోపణ చేయుచు ఈలాగనెను: "మా విరోధియగు ఆ పగవాడు దుష్టుడైన ఈ హామానే అనెను" (ఎస్తేరు 7:6).

**3.Patience:** సహనము లేక ఓర్పు : -

దేవునియొక్క సహనమును గూర్చి చదువునప్పుడు అమాలేకీయులను బట్టి ఆయన చేసిన వాగ్దానమును చూడగలము. నిర్గమ 17:14లో ఆయన ఈలాగు చెప్పుట వినగలము. "నేను అమాలేకీయుల పేరు ఆకాశము క్రిందనుండ కుండా బొత్తిగా తుడిచివేయుదును".

ఒక వంద సంవత్సరములు గతించెను. 200 సం॥లు 300 సం॥లు మరియు తరకను అమాలేకీయులు దేవునికి విరోధముగా యుద్ధము చేయుటకు వెంటాడిరి. దేవుడు తన మంచి వాగ్దానము చేయుటకు ముందు నాలుగు వందల మూడు సంవత్సరములు గతించెను. 1సమూ 15:2 లో మనము చదివినట్లుయిన "సైన్యములకధిపతిగు యెహోవా సెలవిచ్చినదేమనగా - అమాలేకీయులు ఇశ్రాయేలీయులకు చేసినది నాకు జ్ఞాపకమే". ఆయన సౌలుతో "కాబట్టి నీవు పోయి వారికి కలిగినదంతయు బొత్తిగా పాడుచేసి అమాలేకీయులను నిర్మూలము చేయుమని చెప్పెను".

యాకోబు క్రైస్తవులకు ఈ విధముగా ఉపదేశించుచున్నాడు. "సహోదరులారా ప్రభువు రాకడ వరకు ఓపిక కలిగియుండుడి"... (యాకోబు 5:7). ఆయన ఇంతకుముందు ఈ విధముగా చెప్పెను " మీ విశ్వాసము వలన కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని ఎరిగి... " (యాకోబు 1:3).

మనము మంచి బిడ్డలను కలిగియున్నాము. వారితో ఓర్పుగా పనిచేయాలి. అందమైన పువ్వులు పెంచవలెనన్న,మంచి సంగీతమును నేర్చుకొనవలెనన్న ఓపికతో పనిచేయుట పరిశ్రమించుట అవసరము. ఈ పఠన భాగాన్ని పరిచయము చేసిన చిన్న బాలిక వలె మనము కూడా జీవింతము. "అంతరంగికముగా కొంచెము తీపిని లేక మాధుర్యాన్ని కలిగియుందము"

- బెట్టీ టక్కర్, ( VOT )

## బైబిలు కరస్పాండెన్స్ విద్యార్థులకు ముఖ్య గమనిక

సత్యవాణి ద్వారా లక్షలాది ప్రజలు బైబిలు పాఠములను ఉచితముగా పోస్టు ద్వారా పొందుచు సత్యమును గ్రహించుచున్నారు. కొందరికి పాఠములు సకాలములో అందుట లేదనియు, అసలే అందుట లేదనియు మాకు తెలియుచు వచ్చినది. మీరు పూర్తిచేసిన ప్రశ్నాపత్రములు ఒక్కోసారి మాకు అందకపోవచ్చును. గనుక వెంటనే తదుపరి పాఠములను మేము పంపలేము, లేదా మేము మీకు పంపిన పాఠములు మీకు కూడ అందియుండక పోవచ్చును. గనుక మీరు మాకు ప్రశ్నాపత్రములను పూరించి పంపుట జరుగదు. అందువలననే మీకు మా వద్ద నుండి 15 రోజులలోగా పాఠములు అందకపోయిన యెడల మీకియ్యబడిన రిఫరెన్సు నంబరును మాకు వ్రాస్తు ఒక కార్డు ద్వారా తెలియజేయండి. మీరు మాకు రిఫరెన్సు నంబరుతో సహా తెలియజేయకపోతే మేము ఏమీ చేయలేము.

బేసిక్ బైబిలు కోర్సు పూర్తి చేసిన ప్రతివారికి ఉచితముగా బైబిలు బహుమతిగా ఇచ్చుచున్నాము. ఒకవేళ మీకు సర్టిఫికేట్ మాత్రమే అందియుండి, బైబిలు అందనిచో మాకు వ్రాయండి. మీ రిఫరెన్సు నంబరు వ్రాయుట మరచిపోవద్దు. బైబిళ్లను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుచున్నాము. గనుక మీకు అందకపోతే మేము తగుచర్య తీసికొనే అవకాశం కలుగును.

మీరు బేసిక్ బైబిలు కోర్సు ద్వారా ఆత్మీయముగా మేలు పొందితే మీ బంధువులు, మిత్రులను ఆ కోర్సులో చేర్పించండి. వారి అడ్రసులను మాకు పంపితే వెంటనే వారికి బైబిలు పాఠములను పంపించగలము. ఈ దిగువ అడ్రసుకు వారు గాని, మీరు గాని వెంటనే వ్రాయండి,

**SATYA VANI**
**P.O. BOX. 80,**
**KAKINADA, 533 001 A.P.**

# క్రీస్తు సంఘము - నిజామాబాద్

## సువార్త కూటములు

## GOSPEL MEETINGS AT NIZAMABAD

తేదీలు : 1998 అక్టోబరు 1నుండి 4 వరకు (గురువారం నుండి ఆదివారం వరకు)
ప్రతిరోజు ఉదయం 10 గంటలకు సాయంత్రం 7 గంటలకు

స్థలము : క్రీస్తు సంఘము
గుర్బాబాది రోడ్, దుబ్బా, నిజామాబాద్.

ఉపన్యాసకులు :
1. Bro. కె. స్వామిదాస్
   డైరక్టర్, కలకత్తా స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
2. Bro. జాషువా గూటం, సత్యవాణి, కాకినాడ
3. Bro. ఆర్. సి.హెచ్. సద్గుణరావ్, శ్రీకాకుళం
4. Bro. వి. చిన్నయ్య కడలి, తూ॥గో॥జిల్లా
5. Bro. శ్యామ్ సలామ్, మణిపూర్

తెలంగాణా ప్రాంతములో సత్యమును అన్వేషించుచున్న వారికి ఇదొక గొప్ప తరుణము. దూరప్రాంతముల నుండి గొప్ప సువార్తికులు వచ్చు చున్నారు, గనుక ఈ కూటములను మీ ఆత్మీయ మేలు కొరకు ఉపయోగించుకొనండి. దూరప్రాంతముల నుండి వచ్చువారికి ఉచిత భోజన సదుపాయముకలదు. రండి, వినండి, సత్యమును గ్రహించండి. మీకు మా ప్రేమ పూర్వక ఆహ్వానము.

ఇట్లు క్రీస్తునందు

క్రీస్తు సంఘము — Bro.N. టైటస్ &
నిజామాబాద్ — Bro.N. ఎబినేజర్

ఆగస్టు 28 వతేదీ శుక్రవారం నాడు కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఈ సదస్సుకు పలు ప్రాంతములనుండి ఇంచుమించు 400 మంది సువార్తికులు హాజరైరి. సదస్సులో అమెరికా నుండి వచ్చిన రేండీ ప్రిచట్‌గారు, మరియు జే కోర్బెట్ గారు ముఖ్య అతిధులుగా పాల్గొని చక్కని వర్తమానముల నందించిరి. భారత దేశములో జరుగుచున్న క్రీస్తు సువార్త పనిని గూర్చి విని, చూచి హర్షించిరి. అటు తరువాత సదస్సు విషయమై ఏర్పాటు చేయబడిన అంశమును అనగా " రక్షింపబడుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునా? విధేయత కూడా అవుసరమా? " అను అంశమును సోదరులు ఇ.కె.వి. ప్రసాదరావ్ గారు కూలంకషముగా చర్చించిరి. విధేయత లేని విశ్వాసము వ్యర్థమని, మృతమైనదని హెచ్చరించిరి.

అమెరికా సోదరులు రేండీగారు, జే గారు ఆగస్టు 29 న తాడిపూడిలోను, 30వ తారీఖున కాకినాడ స్థానిక సంఘములోను, లక్ష్మీ పోలవరంలోను, 31న పాలకొల్లు, భీమవరంలో పలు ప్రాంతములలోను, సెప్టెంబరు 2వ తేదీనాడు బిళ్లకుర్రులోను వాక్య పరిచర్య గావించగా ఇంచుమించు 60 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సెప్టెంబరు 2 నాడు బిళ్లకుర్రులో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును జే కోర్బెట్ గారు రిబ్బను కత్తిరించి వాక్య పరిచర్య గావించిరి. బిళ్లకుర్రులో సోదరులు పి.జె. కృపాలినీ గారు వాక్య పరిచర్య గావించు చున్నారు. సెప్టెంబరు 3వ తేదీనాడు అమెరికా సోదరులు తమ స్వదేశమునకు ప్రయాణమై పోయిరి.

క్రైస్తవ కీర్తనల పుస్తకము 237 కీర్తనలతో మరల ముద్రించబడినది. అందరూ పాడుటకు వీలుగా పెద్ద అచ్చులో అది ముద్రించబడినది. కొన్ని వాడుకలో లేని పాటల స్థానమున క్రొత్త కీర్తనలు చేర్చబడినవి. సత్యవాణి సంగీత మాలిక కేసెట్లలో గల పాటలు అనేకము అందు చేర్చబడినవి. ఈ కీర్తన పుస్తకముల ద్వారా సంఘ సంగీతము మరింత అభివద్ధి యగునట్లు ప్రార్థించుదాం.

## క్రైస్తవ కీర్తనలు

237 కీర్తనలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం ఇప్పుడు మరల 5వ సారి ముద్రితమై లభ్యమగుచున్నది. అనేక పాత, క్రొత్త కీర్తనలు ఇందులో చేర్చబడినవి. పెద్ద అచ్చులో ముద్రితమై చక్కగా బైండింగ్ చేయబడి యున్నది. ఒక్కొక్క కాపీ మూల్యము 15/- రూపాయలు మాత్రమే. పోస్టేజీ అదనము. వలయు వారు ఈ దిగువ చిరునామాకు మనియార్డరు చేయండి :

**SATYA VANI**
P.O. BOX 80,
KAKINADA, A.P. 533 001

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications , Kakinada - 533 004

**PRINTED BOOK - BOOK POST**

**From:**

**SATYA WAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

**To**